క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్‌కు డాక్టరేట్



మెండ నరసింహమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న మెండ నరసింహమూర్తి డాక్టరేట్ సాధించారు. విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బి.లిల్లీగ్రేస్ గైడ్‌గా ఏపీలో విద్య, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం చేస్తున్న వ్యయం అనే అంశంపై పరిశోధన చేశారు. ఈయనది ఎల్ఎన్‌పేట మండలం ధనుకువాడ గ్రామం. ఈ సందర్భంగా నరసింహమూర్తిని వర్సిటీ అధికారులు, బోధకులు అభినందించారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ శిఖర ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట పంచాయతీ బెండివానిపేటలో శుక్రవారం దుర్గాదేవి ఆలయ శిఖరం ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎన్ని ధనుంజయరావు, నాయకులు మొదలవలస కృష్ణ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోరవానిపేటలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గార : మండలంలోని బోరవానిపేట పంచాయతీలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. శ్రీరామ యువసేనా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. మేలుకొలుపు ద్వారా వచ్చిన బియ్యాన్ని శాలిహుండం యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం కోసం వినియోగించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల త్రోబాల్ జట్టు జిల్లా స్థాయి గ్రిగ్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం పట్టణంలో గురువారం జరిగిన పోటీల్లో సత్తాచాటి ట్రోఫీ, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులను హెచ్ఎం ఎం.లక్ష్మణరావు, పీడీ స్వీటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన



బీమా చెక్ అందజేస్తున్న బ్యాంకు రీజనల్ మేనేజర్ అనంతరావు

రణస్థలం: బ్యాంకింగ్ సేవలపై ఖాతాదారులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్ల బీమా, ఇతర అలవెన్సులు పొందలేకపోతున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు అన్నారు. మండలంలోని జీరుపాలెంలో ఏపీజీవీబీ రణస్థలం శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుకు ప్రమాద బీమా సొమ్ము రూ.20లక్షలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.శివ ప్రసాదరావు, ఎస్‌బీఐ జనరల్ బీడీఎం వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో పూజలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. శ్రీచక్రాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పార్కు అభివృద్ధి పట్టదా?



అస్తవ్యస్తంగా ఉన్న విజయాదిత్య పార్కు

- విజయాదిత్య పార్కులో ఆహ్లాదం కరువు
- గత ప్రభుత్వ హయాంలో రూ. 2.54 కోట్లు కేటాయింపు
- ముందుకు సాగని పనులు
- డీపీఆర్ తయారీలోనే మున్సిపల్ అధికారులు



పార్కు వద్ద పూడికలతో దర్శనమిస్తున్న చెరువు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగర సమీపంలోని సీపన్నాయుడుపేటలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విజయాదిత్య పార్కు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో స్థానికులకు ఆహ్లాదం కరువవుతోంది. అమృత్ 2.0 పథకం కింద విజయాదిత్య పార్కు అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ 2.54 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనామోదం తెలిపారు. ఇందుకు పూర్తిస్థాయిలో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) తయారు చేయాలని అన్ని ఏర్పాట్లు చేసినా మోక్షం కలగలేదు. ఈ నిధుల్లో రూ.67 లక్షలు కేంద్ర ప్రభుత్వం నిధులు, రూ.1.35 కోట్లు 15 ఫైనాన్స్ నిధులు, రూ. 52 లక్షలు కార్పొరేషన్ నిధులు. ఈ ప్రక్రియ పూర్తయ్యేలోపు ఎన్నికల కోడ్ రావడంతో పార్కు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆట వస్తువుల ఏర్పాటు, కొలను గట్టు పటిష్టం చేయడం, సుందరమైన మొక్కలు ఏర్పాటు, చెరువులో బోటింగ్ వంటి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పార్కును అభివృద్ధి చేసేందుకు ఒక్క అడుగు ముందుకువేయలేదు. దీంతో శ్రీకాకుళం నగరంతో పాటు స్థానికులకు ఆహ్లాదం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పార్కులు అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నేతలు ఊకదంపుడు ప్రచారాలు చేసినా కార్యాచరణలో మాత్రం ఒక్క అడుగు ముందుకు వేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆహ్లాదం కరువు..



రోజంతా పనిచేసి సాయంత్రం వేళ సేదతీరుదామంటే అందుబాటులో సరైన పార్కులేదు. విజయాదిత్య పార్కు పూర్తిగా పాడైపోయింది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి పార్కును అభివృద్ధి చేస్తే మంచిది.

– ఎస్.ధర్మారావు, భైరవానిపేట

చర్యలు చేపడతాం..

విజయాదిత్య పార్కును అభివృద్ధి చేసే బాధ్యతలను గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌కు ఇచ్చాం. వారు టెండర్లు పిలిచి పనులు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే ఫెన్సింగ్ వేయడంలో తేడా రావడంతో పనులు ఆపేయాలని చెప్పాం. ఓపెన్ జిమ్‌కు తగినట్లు చేయాలని చెప్పాం. కాంట్రాక్టర్ అప్పటి నుంచి పనులు చేసేందుకు తిరిగి రాలేదు. వీలైనంత త్వరగా పనులు జరిగేలా చర్యలు చేపడతాం.

– పి.వి.వి.డి ప్రసాద్, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యతో పాటు న్యాయ విజ్ఞానం కలిగి ఉండాలని, తద్వారా శాంతియుత సమాజ స్థాపన జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న జరగనున్న ప్రపంచ వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని తిరుమల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయవిజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ సేవ సంస్థ సభ్యులు గేదెల ఇందిరాప్రసాద్, ప్రిన్సిపాల్ వి.టి.నాయుడు, ఎంవీజీ శంకర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం అవసరం



మాట్లాడుతున్న బుడుమూరు గోవిందరావు

ఎచ్చెర్ల క్యాంపస్: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా సమగ్ర విద్య కో–ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం భారత పునరావాస మండలి (రీహేబిలిటేషన్ ఆఫ్ ఇండియా) న్యూఢిల్లీ ఆధ్వర్యంలో కంటిన్యూడ్ రీ హేబిలిటేషన్ ఎడ్యుకేషన్ అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో 15 శాతం మంది మానసిక, శారీరక, ఇతర లోపాలతో ఉంటారని, వారి కోసం ప్రత్యేక చట్టాలు అమల్లోకి వచ్చాయని చెప్పారు. చదువులో సైతం రాణించేలా మానసికంగా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఎం.అన్నపూర్ణ, వీసీ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

11న ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 11వ తేదీన ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఈవో వై.భద్రాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమి తర్వాత జరిగే ఈ కార్యక్రమానికి స్వచ్ఛంద సేవకులు, గ్రామ పెద్దలు హాజరై లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

వృథాగా తాగునీరు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రధాన గేటు ముందు కుళాయికి ట్యాప్ లేకపోవటంతో తాగునీరు వృథాగా పోతోంది. ట్యాప్ ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పారిశ్రామిక సందర్శన



ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు సంకిలి షుగర్ ఫ్యాక్టరీని శుక్రవారం సందర్శించారు. పరిశ్రమ నిర్వహణ, మానవ వనరుల వినియోగం, ఉత్పత్తి, డిమాండ్, లాభనష్టాలు తదితర అంశాలను తెలుసుకున్నారు. సీనియర్ అధ్యాపకులు ఎం.రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

విజేతలకు అభినందన



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిప్లమా చివరి ఏడాది విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 3, 4 తేదీల్లో టెక్కలి ఐతం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్ టెక్నోవిజన్–2025లో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య, విభాగాధిపతి డి.మురళీకృష్ణ శుక్రవారం అభినందించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

సెగిడిపేటలో దుర్గంధం



మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేట ప్రధాన వీధిలో రోడ్డు పక్కనే మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో ఆ ప్రాంతమంతా దోమలు, ఈగలుకు నిలయంగా మారింది. పంచాయతీ అధికారులు స్పందించి పనులు జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

– గార

నిద్దాలమ్మా.. కాపాడాలమ్మా..



ముర్రాటలతో వెళ్తున్న భక్తులు



నిద్దాలమ్మ

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో నిద్దాలమ్మ తల్లి యాత్ర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు సమక్షంలో మహిళలు ఒకేసారి ముర్రాటలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా కమ్మసిగడాం మహాలక్ష్మి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



బందోబస్తుకు హాజరైన పోలీసులు

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం పంచాయతీలో మహాలక్ష్మీతల్లి కల్యాణం శుక్రవారం రాత్రి 9.30 గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. బంటుపల్లికి చెందిన వేలిచేటి కుటుంబీకులు పల్లకిలో ఊరేగింపుగా వచ్చి కల్యాణం జరిపించారు. మహాలక్ష్మి కన్నవారైన చీపురుపల్లి మండలం పెదనడిపిల్లి చెందిన ఎరిమెని కుటుంబీకులు తాళిబొట్టు, చీర, పసుపు–కుంకుమ, సారెలు తీసుకువచ్చారు. అత్తవారి గ్రామమైన సంచాం నుంచి భర్త బొట్లగుఅప్పదొర కుటుంబీకులు మేళతాళాలతో హాజరయ్యారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి కల్యాణం తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమ్మసిగడాం జాతర ఏర్పాట్లను శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షించారు. ఆయనతో పాటు జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గోశాలలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



గోవులకు పూజిస్తున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



జగన్నాథ, సుభద్ర, బలరామ విగ్రహాలు



కోష్ట గోశాలలో విగ్రహ ప్రతిష్ట పూజలు చేస్తున్న స్వామీజీలు

కోష్ట గ్రామంలో గోశాల – గోకులానంద ఆశ్రమంలో శ్రీ కృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జగన్నాథ, సుభద్ర, బలరామ విగ్రహాలు, రాధా గోవింద, అష్టభుజ లక్ష్మీనరసింహ అవతార స్వామి, భక్తి వైభవ పూరి గోస్వామి మహారాజ్, జగద్గురు శ్రీల ప్రభుపాద పరమ పూజ్య పాద భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూరు, నిత్యానంద చైతన్య ప్రభుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, స్వామీజీలు, భక్తులు పాల్గొన్నారు.

– రణస్థలం



హాజరైన భక్తులు

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

గార: వైఎస్సార్ కాంగ్రెస్ గార మండల పార్టీ అధ్యక్షుడిగా తనను పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై కొర్ని పంచాయతీ సర్పంచ్ పీస గోవిందరాజులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ గొండు రఘురామ్, జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

శోభాయాత్రకు రూ.10వేల విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన ఆరిక తోట కనకరాజు ఉమా దంపతులు పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతినిధులకు శోభాయాత్ర కోసం రూ.10 వేలు విరాళం అందజేశారు. పీఎన్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పాత శ్రీకాకుళం కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు శోభాయాత్రలో పాల్గొనే కళాకారులకు అల్పాహారం అందించేందుకు ఈ సాయం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు తెలిపారు.

కళాకారుడికి సత్కారం



పురస్కారం అందుకుంటున్న పైల సింహాద్రినాయుడు

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన హాస్య కళాకారుడు, మద్య నిషేధంపై ఐదు వేలకు పైగా బుర్రకథలు ప్రదర్శించిన పైల సింహాద్రినాయుడు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం అందుకున్నారు. ఇటీవల విజయవాడ తుమ్మలపల్లిలో జరిగిన వివేకానంద ఉత్సవాలు సందర్భంగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సింహాద్రినాయుడును సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ బెవర విజయలక్ష్మి, నాయకులు సీతారాం, జగన్నాథం, విష్ణుమూర్తి తదితరులు శుక్రవారం అభినందించారు